


# గుణాంతరం

– నవులూరి వెంకటేశ్వరరావు

## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## బహుమతి పొందిన ఉత్తమ నవల
## (గత సంచిక తరువాయి)

**"మీకే అదేంటో అంతగా** తెలియనప్పుడు నాకు తెలుస్తుందని ఎందుకు భావిస్తున్నారు?"

"మీరు నాలోని ప్రత్యేకత గురించిన ప్రశ్నను లేవదీశారు గనుక."

"మీ నుంచీ అడిగి తెలుసుకుందామని వేసిన ప్రశ్నేకానీ; మన ఇద్దరికీ తెలిసిన ఒక విషయం గురించీ గుర్తుకు తెస్తున్నట్టు అడిగినది కాదు."

ఆమె తన ఆర్థిక స్థాయి గురించీ మాట్లాడకుండా కావాలని అతన్ని సందిగ్ధంలో పడేసింది. ఆమె కావాలనే అలా చేసుండవచ్చని అనంతం కూడా భావించాడు. బిడియపడి ఉండవచ్చు. ఆమె కేవలం కాస్త డబ్బున్న మధ్య తరగతి మనిషి కావచ్చు; ధనవంతురాలూ కావచ్చు. తన ఊహ నిజం కాదని తేలనంతవరకూ ఆమె బంగారు పిచ్చుక అనుకోడమే ఉత్తమం అనిపించింది.

"పేద మన్మథుడిని ఊహించుకోడం సాధ్యమేనా?"

ఉన్నట్టుండి, ఆమె మనసులోని మాటలు ఆమె అనుమతి లేకుండా బయటపడ్డాయి.

"ధనవంతులంతా అందంగా ఉంటారని, పేదలు కురూపులుగా ఉంటారని ఎక్కడా వినలేదు; నా అనుభవంలో వెల్లడి కాలేదు."

ఆమె పరోక్షంగా తనను మన్మథుడిలా ఉన్నావని అన్నట్టు భావించి ఆనందించాడు. నీవు పేదవాడివి అని గుర్తించా అని ఆమె పరోక్షంగా అనింది; ఇది బాధపెట్టలేదు. ఆమె భావన భవిష్యత్తులో తనకు ఉపయోగపడకపోదు.

ఆమె తనది ఫ్రాయిడియన్ స్లిప్ అని గ్రహించింది. విసిరిన రాయిని వెనక్కు తీసుకోడం అసాధ్యం.

"మనం అనే మాటలలో చాలా వరకూ మరొకరినెవరినో ఉద్దేశించినవే ఉంటాయి కదా. మిమ్మల్ని మీరు మన్మథుడిగా భావించడం వలెనే నా మాటలను మీకు అన్వయించుకున్నారేమో!"

బంగారు గని ఒక్క సెంటీమీటరు కూడా మిగలకుండా కుర్చీ అంతా ఆక్రమించింది. అందులోనుంచీ లేచినపుడూ రజను అందులో ఉండక పోదు. ఆమె ఆస్తిపాస్తుల గురించీ ఏమాత్రం తెలియకపోయినా అతనికి ఆమె గనిలా, నిచ్చెనలా కనిపిస్తోంది. ఈ గని తరగనిదని, ఈ నిచ్చెన ఆకాశానికి వేసినదని ఒక గుడ్డినమ్మం. దేవుడి విషయంలో ఉండేదాని లాంటిది. తప్పవచ్చు; కాకపోవచ్చు. నమ్మకానికి ఆశకు అవినాభావ సంబంధం. అవి జీవితానికి ఇంధనాలు, ధనాలూ. ఆ గని చేయి వెయ్యనీయాలి, ఆ నిచ్చెన కాలు పెట్టనీయాలి. వాటికి ఏమి లాభం అనుమతించడం వలన? కనీసం దౌర్భల్యం ఉండాలి. అవి ఉపకారాలు చేస్తాయి, అవిగల మనిషిలో స్వతహాగా ఉపకార బుద్ధిలేక పోయినా. ఆమె చెమటగబ్బు డబ్బుదనపు సుగంధంలా అనిపిస్తోంది. ధనం, దేహం అద్భుతమైన పాత్రలను పోషిస్తాయి మానవుడి జీవితంలో. మనసు నడిపే దేహమే లేకపోతే ఆ మనిషికి జీవితం ఏముంటుంది కనుక. యాతనా దాని గురించేగా.

"నన్ను నేను మన్మథుడిగా భావించుకోడం మిమ్మల్ని ఇబ్బందిపెట్టదనుకుంటా. మన్మథుడి దారిద్ర్యం మన్మథుడి జీవితారంభం నుంచీ ఉంటున్నదే. నా దారిద్రియం గురించీ నాకు సహాయం చేయదలచుకోని వాళ్ళు మాట్లాడినా పట్టించుకోను."

"అనాలోచితంగా దొర్లినా మాటలు ఇంత చర్చకూ, సిద్ధాంతీకరణకూ దారితీయడం తమాషాగా ఉంది; అంటే వినోదంగా ఉందని కాదు అర్థం."

"నాకు సంబంధించినంత వరకూ మీరు హద్దులు పాటించక్కర లేదు; నేను మాత్రం హద్దు మీరను."

"నా గొప్పదనం ఏమిటట?"

"నా మనసు నాకు చెప్పని గొప్పదనం ఉండుంటుంది; లేకపోతే ఆ మాటలు తోచి ఉండవు."

ఆమె చివాలున లేచి నిలబడింది.

"నేను మిమ్మల్ని బాధించే మాటలు ఏమన్నాఅన్నానా?"

“లేదు. మీ ఆత్మ గౌరవానికి సంబంధించిన మాటలు నేనే అన్నా. కావాలని కాదు."

చివాలున లేచిపోవడానికి గల కారణం ఇద్దరిమధ్య అతిగా, అనవసరంగా సంభాషణ జరిగిందని గ్రహింపు, కాస్త భయం, సిగ్గు.

"మీకు ఒక పచ్చి నిజం చెప్పాలనుంది. అందరికీ అలా చెప్పను; చెప్పకపోవడంలో అదోరకమైన ఆత్మగౌరవం ఉందేమో. కానీ వింతగా, నాకు నా లక్ష్యాలు సాధించడంలో ఆత్మగౌరవానికి చోటే లేదు; అది ప్రతిబంధకం కారాదు. మీలాంటి భేషజం లేని, మంచిదనం పుష్కలంగా కలిగి ఉన్న వ్యక్తి ఎవరి ఆత్మగౌరవాన్నీ కించపరచగలదని నేను అనుకోవడం లేదు; మన పరిచయం స్వల్పమైనదే కావచ్చు."

ఆమె కూర్చుండిపోయింది.

అతను ఆబఆబగా పెన్నిధిని చూస్తున్నట్లు ఒళ్ళంతా కళ్ళు చేసుకుని ఆమెను చూస్తున్నాడు. ఆ చూపులు ఆ వ్యక్తికి ఇబ్బందిని కలిగించ వచ్చన్న విషయం అతనికి తోచినా కళ్ళకు పగ్గాలు వేయలేదు; అలా చూడటం వలన కలుగుతున్న ఆనందాన్ని కోల్పోవడం ఇష్టం లేక. దాని వలన తనకు ఇబ్బందుందని బహుశా గ్రహించీ ఆ పని అతను మానకపోవడం ఆమెకు కాస్త కోపం కలిగించింది. అలా చూడబడటంలో కొంచం గర్వం, కొంచం ఆనందం ఉండటం ఆమె గమనించి అతనిని ఓర చూపులు చూస్తోంది. ఓర చూపులు అతనికి ఆనందం కన్నాఆశ కలిగించాయి. తాను వెళ్లిపోకుండా అలా కూర్చోవడం, ఏ విషయం అంతగా మాట్లాడకపోవడం అతని అందానికి నేను బందీ అయ్యాననిపిస్తుందేమో; దాని వలన తాను నష్టపొయ్యేదేమీ లేదు అనిపించిందామెకు. ఆమె జెడ కుర్చీ వెనుక దళసరి తాడులా, తాచులా వ్రేలాడుతోంది. అతను నిజమైన ప్రేమికుడే అయితే ఆ పాము చేత కాటు వేయించుకునే వాడు, ఆ తాడుకు ఉచ్చు వేసి మెడకు తగిలించుకుని ఆత్మహత్యా ప్రయత్నం చేసేవాడు. ఆమెను ఉపయోగించు కుందామనుకుంటున్నాడే కానీ, ఆమె తనప్రేమకు అర్హురాలు అనుకోలేదు. ఆమె తల కదిపినపుడల్లా ఆ జెడ బెదిరిస్తున్నట్టు, ఆహ్వానిస్తున్నట్టు ఊగుతోంది. అతని దృష్టిలో జడ భాష కేవలం ఒక అవకాశాన్ని సూచిస్తున్నట్టుంది. దివ్యలోకం నుంచో, గతకాల పుటలనుంచో వచ్చి ఆ పాత పరుపుపై కూర్చున్న మన్మథుడిలా, రోమనుడిలా ఉన్నామృత్యుపురుషుడిలా కూడా భయపెడున్నాడు. ఏమిటీ వింత అనుభవం ఈ గదిలో అనుకుని ఆశ్చర్యపడింది. అతను దాచుకోడంలో విఫలమైన దైన్యం అతనిలో తొంగి చూస్తోంది. తెలివితేటలూ, అందం జోడీగా ఉన్నా ఈ పేదరికపు ఊబి నుంచి పైకి రావాలనే ప్రయత్నంలో అతనున్నట్టు; రాలే ఆకుకూడా తనను పైకి లాగుతుందని ఆశిస్తునట్టూ ఆమెకు అనిపించి మనసంతా జాలితో నిండింది. నేను తలచుకుంటే చూపుడు వేలును సాయంగా అందించవచ్చు. కానీ ఎందుకు అందించాలి? ఏదో ఒక బలమైన కారణం, స్వార్థం ఉండాలి కదా? తనకే కాక తన భర్తకూ ఆస్తిపాస్తులున్నాయి. 'ప్రేమ' పేరు పెట్టగల మోహం ఆమెను అతనికి వేలు అందించనిస్తుంది. అది రాత్రికి రాత్రి ఏర్పడానూ వచ్చు సమయం తీసుకోనూ వచ్చు. మోహం ఊబిగా మారకూడదు. దాన్ని అదుపులో ఉంచుకోడానికి వీలుంటుందా? రూపాయనైనా ఖర్చు పెట్టటం వ్యాపారంలో భాగమే. మోహాన్ని తీర్చుకోడానికి ఖర్చు చెయ్య వచ్చు. ఇరువురిలోనూ అదుంటే ఖర్చు ప్రసక్తి రాదు. నైతికత ప్రలోభాలకు బలి కావడం సాధారణ విషయం. ఆ రెండింటికి ఒక రకంగా పోరాటం జరుగుతుంటుంది. ఆయా వ్యక్తులలో ఏ శక్తి బలమైనదో అది గెలుస్తుంటుంది. ఆమెను లొంగదీసుకోవడం సాధ్యమైన విషయమే అనిపించింది అనంతంకు. తన అందమే ఎర; తప్పించుకో గల చేపలు అరుదు. అవకాశాలే రాలేదు. తన గదికి రావడం; అంతసేపు కూర్చుండిపోవడం; అన్ని మాటలు మాట్లాడటం; చంచలమైన చూపులు – అతని అభిప్రాయాన్ని బలపరుస్తున్నాయి. ప్రయత్నంలో చిన్న పొరబాటు జరిగినా వ్యవహారం బెడిసికొడుతుంది. గని చేజారిపోతుంది; నిచ్చెన నేలకు ఒరిగి పోతుంది. క్షణ క్షణ భంగురముల్ జవరాళ్ల

చిత్తముల్ అన్నాడు పెద్దన. ఉమన్, థై నేమ్ ఈజ్ ఫ్రేయిలిటీ! అన్నాడు షేక్స్పియర్. ఓపిక కావాలి. అది పట్టటం కష్టం అతనున్న పరిస్థితిలో.

"ఆటకు ఈ పూట వెళతారా?"

"మరో పనీ, పాటా లేవు కదా."

ఆమె లేచిందీ. సాగని సంభాషణ రుచిగా ఉండదు. ఆమె సాలోచనగా ఉండిపోవటం ఆమెలోని కల్లోలానికి సంకేతం అనిపించింది. అతని వైపు చూడకుండా ఉండటానికి తంటాలు పడటం అతను గమనించాడు. ఆ భార్యాభర్తలతో పరిచయం తన జీవిత మార్గాన్ని నిర్దేశించినట్టనిపిస్తోంది. తన డబ్బు అవసరాన్ని అతనికి అనుక్షణం గుర్తుకు వస్తోంది. అది అవసరమే కాదు ఆకలి. నీతి, నియమాలు అతనికి సంబంధించినంత వరకూ మొసలి పాలయ్యాయి. ఆమె బైటికి నడిచింది. తలకు మించిన ఆలోచనా భారాన్ని మోస్తున్నట్టు, అదుపుతప్పిన కాళ్ళను ఈడుస్తున్నట్టు; విలువైన వస్తువును ఆ గదిలో పారేసుకున్నానన్న మనో వేదన ఆమెకు ఉన్నట్టు – అతను ఊహించుకుని సంతృప్తిపడ్డాడు.

అతను ఎలాగు ఆట గురించీ బయలుదేరాలి. ఆమెతో కలిసి వెళితే? ఆమె ఇంటి మీది నుంచీ వెళ్లొచ్చు. అలా తనతో కలిసి నడవటం, చనువును ప్రదర్శించడం ఆమెకు నచ్చకపోవచ్చు. చనువుకు కొలబద్ద లేదు. ఒంటరిగా గదికి వచ్చి అరగంట కూర్చోడంకన్నా, కలిసి పావుగంట రోడ్డు మీద నడవటం ఎక్కువ చనువు అని భావించడం సరి కాకపోవచ్చు. ఒంటరిగా కలిసి ఉండటానికి, నలుగురి కళ్ళ ముందు నడవటానికి తేడా ఉందేమో. ఎలా నిర్ణయించడం? కలిసి నడవడం చనువుతో గదిలో గడిపిన దానికన్నా ఒక మెట్టు అధికం అవునో కాదో తెలియనప్పుడు ఆ పని వలన ఉపయోగం ఉండదు. మెట్లన్నింటిని ఒకే గంతులో దాటే ప్రయత్నం చెయ్యడం తొందరపాటు. కాళ్ళూ చేతులూ విరగ వచ్చు. "నేనూ వస్తానుండండి," అంటే వద్దని మాత్రం అనలేదు – దాని 'లాభ, నష్టాల' మాటెలా ఉన్నా.

కృపారావుతో లేక ఆమెతో స్నేహం ఏర్పరచుకోవడం ఏ విధంగా తనకు ఉపకరిస్తుందో తనకే ఇంకా స్పష్టంగా తెలియదు. ఒక డబ్బున్న స్త్రీ అంతరంగంలోకి ప్రవేశించడం ఏదో ఒక లబ్ధికి దారి తీయవచ్చన్న ఆశ మాత్రం అతనిలో ఉంది 'ఏ విధంగా?' విత్తనం ఇప్పుడే భూమిలోకి దూరింది. అది వెంటనే మొలవదు. అది మొలిచి పెరగటానికి కాలక్రమేణా సంఘటనలు దోహదం చెయ్యాలి. ఈ కథకు శ్రీకారం ముగ్గురిలో ఎవరూ చుట్టలేదు. అలా చుట్టబడని కథలో పాత్రలు ముగ్గురు.

అతని దగ్గిరున్న 'ఆస్తి' సూర్యరశ్మి సోకిన మంచులా కరిగిపోతుంది. తిండికి వెతుక్కోవలసిన అవసరం పడుతుంది. ఏ ఉద్యోగం గురించి ప్రయత్నం చేయగలడు? రోడ్డు తుడిచే ఉద్యోగం కూడా తనకు లభించడం కష్టం – ఆ పని అనుభవం, చేయగల చాకచక్యం లేక పోవడం వలన, సిఫారసు లేక పోవడం వలన. పాత ఉద్యోగాల లాంటివి కష్టం మీదగాని దొరకవు. ఎన్నని అలాంటివి ఇలా చేసి ఆలా పోగొట్టుకోడం? వీళ్ళ దగ్గిర కనీసం అప్పుపుట్ట వచ్చు ఒక నెల గ్రాసానికన్నా. నివాసం అద్దె ఒక నెల గ్రాసమంత. నిష్క్రియత్వం వలన ఏదీ రోడ్డు మీది నుంచీ వచ్చి గదిలోని తన ఒళ్ళో

పడదు. పిరికితనం అతనిలో ప్రస్తుతం లేదు. ఏమి జరగబోతున్నదన్న ఆత్రుతే కానీ. రోడ్డు పాలవుతానన్న పిరికితనం అంతగా లేదు.

ఆమె అతి నెమ్మదిగా అడుగులో అడుగేసి నడుస్తోంది. మీమాంసను కట్టిపెట్టాడు. ఆమెతో కలిసి నడవడానికి నిర్ణయించాడు. అతి వేగంగా నడిచి ఆమెను చేరాడు.

"ఎలాగూ ఆటకు వెళ్ళాలి కదా మీతో కలిసి మీ ఇంటి దాకా నడవ వచ్చు అనిపించింది."

"సంజాయిషీ అక్కరలేదు. రోడ్డు మీద మిగతా వాళ్ళూ నడుస్తున్నారు కదా; వాళ్లలో మీరూ ఒకరు అనుకుంటే పోలా?"

"అంతేనంటారా?" నీరసంగా అన్నాడు.

"అలా అంటే మీరు నాకు అపరిచయస్థుడు అని కాదులెండి," అనింది చిన్నగా నవ్వుతూ.

ఇల్లు చేరారు. కృపారావు గుమ్మంలో ఉన్నాడు.

"మీ స్నేహితుడిని నాతో తెచ్చా; కలిసి వెళ్ళండి," అని మాత్రం అనింది, భర్తతో మిగతా విషయాలు టూకీగా రాత్రికి చెప్పవచ్చని.

"స్కూటర్ పాడయ్యి ఆమె ఇబ్బందులు పడ్డారు," అన్నాడు అనంతం.

"ఆయన ఆతిథ్యం ఇచ్చారు," అనింది.

"ఏమాతిథ్యం?"

"గ్లాసుతో కూజా నీళ్లు," అన్నాడు అనంతం.

"నీటిని చిన్న చూపు ఎలా చూడగలం?" అన్నాడు కృపా.

ఇద్దరూ అతని బండి మీద ఆటస్థలం చేరారు.

ఆట ముగిసి వస్తున్నపుడు బైకు దగ్గిర నిలబడి అనంతానికి ఆసక్తికరమైన అంశాలు కృపారావు తెలియజేశాడు. అతని భార్యకు చాలా ఆస్తిపాస్తులున్నాయట. ఆమె తల్లిదండ్రులకు మగపిల్లలు లేరట. వాళ్ళు ఎక్కువ కాలం బతకక పోవడం వలన అన్ని ఆస్తులూ ఆమెకు దక్కాయట. రెండో అంశం ఆమె తన ఆరోగ్యాన్ని, శరీర పరిమాణాన్ని చాలా జాగ్రత్తగా కాపాడుకుంటుంది. రోజూ ప్రొద్దునే బీచ్ రోడ్డుకు వెళ్లి నడుస్తుంది పాండురంగడి గుడి నుంచి హవామహలుకు అక్కడి నుంచీ గుడికి; వీలయితే రెండుసార్లు. ఆమె చీదనుకూడా చీదదట ; దగ్గను కూడా దగ్గదట. కృపారావూ సాధారణంగా చీదడట, దగ్గడట ఆరోగ్య విషయంలో భార్యంత శ్రమ తీసుకోకపోయినా. రాత్రి తొమ్మిదికి నిద్రకు ఉపక్రమించి పొద్దున్న ఎనిమిది దాకా గాఢమైన నిద్రపోతాడట. అందుకే అతనిలో కోపోద్రేకాలు తక్కువట. మానసికంగా ఆరోగ్యవంతుడట. అతను భార్యను తీవ్రంగా ప్రేమిస్తాడట. ఆమె తీసుకునే స్వేచ్ఛ విషయంలో తల దూర్చడట. ఆమే అతని

ప్రాణం అట. కృపారావ్ తన ప్రాణమని ఆమె భావించాలని అతను కోరుకోడట. జీవితంలో కొన్నిఆదర్శాలు అవసరం అట. ఆదర్శాలు ఆదర్శాల గురించే కాక అవి అవసరాలు కూడా నట.

కృపారావు బండి ఎక్కడం ఇష్టం లేక ఏదో సాకు చెప్పి అతన్ని పంపి ఒక్కడే నడిచి గదికి బయలుదేరాడు. నడుస్తుంటే ఆలోచనలూ వేగవంతంగావుంటాయనిపిస్తుంది. పిల్లాజెల్లా లేని, లింగులింగు మని జీవించే ఇద్దరు అంతేసి ఆస్తులను ఏమి చేసుకుంటారు? మురగపెట్టటంలో ఆనందం ఉందేమో. అంత సంపదున్నదన్న స్పృహే ఆనందదాయకం కదా. అలాంటి మనుషులకు సంఘం దానిపై పైసా ఖర్చు చేయకపోయినా సలాం కొడుతుంది కదా. వచ్చి భోంచేశా ననిపించి నిద్రకుపక్రమించాడు. అది దరిదాపులకు రాలేదు. దాని గురించీ మంచంమీద పాతిక సార్లు, నిద్రకు పొర్లుదండాలు పెట్టాడు. ఆరాత్రంతా అలా చేసిన తరువాత అతని కృషి ఫలించినట్టు ఒక మార్గం తెరుచుకుని దర్శనం ఇచ్చింది.

ఆమెతోటి పరిచయాన్ని వీలైనంతగా పెంచుకోడం అతని ప్రణాళికలో భాగం. ఏకాంతంగా కలుసుకోడం దానికి దోహదం చేస్తుంది. ఆమె భర్త చెప్పినదాన్నిబట్టీ ఆమె ఒంటరిగా సముద్రం దగ్గిర నడుస్తుంది. అక్కడ ఆమెను కలుసుకుంటూవుండొచ్చు. తెల్లవారుతుండగా అక్కడికి చేరాడు. పాండురంగడి గుడి సందుగుండా నడిచి ఎదురుగా వున్నా సముద్రపు ఇసుకలో నిలబడ్డాడు తాను వచ్చిన వైపుకు తిరిగి చూస్తూ. ఒకవేళ ముందుగా వచ్చి వెళ్లిపోయిందా అన్న అనుమానం కలుగుతుండగా ఆమె రోడ్డుకు అవతల స్కూటర్ పార్కు చేసి ఎవరి గురించో ఎదురుచూడటం మొదలుపెట్టింది నడుముకు అటూ ఇటూ చేతులు వేసుకుని. ఆరు గంటలవడానికి ఐదు నిముషాల సమయం ఉంది ఆ సమయం శుభముహూర్తం అన్నట్టు ఎదురు చూస్తోందా? వెళ్లి ఆమెను కలవడానికి ఉద్యుక్తుడయ్యాడు. ఆమెను కలిసి ఏమి మాట్లాడాలి? "అరే, మీరు రోజూ వాకుకు వస్తారా? నేను ఈరోజు నుంచే మొదలుపెట్టా," అనొచ్చు. ఇద్దరం కలిసి నడవడానికి ఒప్పుకుంటుందా ఏదన్నా ఒంక చూపి తనను ఒదిలించుకుంటుందా? మీమాంస తెగింపుకు శత్రువు.

ఒక పురుషుడు ఆమె వైపు నడవటం, ఆమె ఉద్రేకంగా రెండుమూడు మాటలనడం గమనించాడు. అతన్ని ఇంతకుముందు అనంతం చూడలేదు. ఊళ్ళో వాళ్లందరినీ అతను ఎలాగూ చూసి ఉండటం అసాధ్యం. చూడగలిగినా గుర్తుండటం మహా అసాధ్యం. ఆ ఆగంతకుడు పానకంలో పుల్లలా ముందు తోచాడు. నిమిషంలో ఆ అభిప్రాయాన్ని మార్చుకున్నాడు. జగత్తులో ఏదీ ఊరికే జరగదు. లోపాలు ఉన్నట్టు కనిపించే లోపాలు లేని జగన్నాటకం. వాళ్లిద్దరూ ఫుట్ పాత్ మీద నడుస్తుండగా ఇసుకలో కాస్త వాళ్ళ వెనుకగా అనంతం నడిచాడు. అంతా పరిహాసాస్పదంగా తోచింది. ఇప్పుడు ఆ పురుషుడిని ఎక్కడ చూసినా గుర్తు పట్టగలడు. వాడు ఆమెకు తాను చేరువవడానికి అడ్డవుతాడన్న ఆలోచన అలలా ఎగిసి భయపెట్టింది. ఆమె అమ్ముడుపోయిన ఆస్తి కాదు అని సమాధానపడ్డాడు. వాడిని వదిలించుకోవడం ఒక అవసరం కావచ్చు; కృపారావుకే కాక తనకూనూ. వాడు శరీరాన్ని ఆకురాయితో అరగదీసుకునైనా సన్నబడటం అవసరం. ఆ విషయం వాడికి తెలిసే ఉంటుంది. బీచిలో నడకకు తోడుగా ఆమెను చేజిక్కించుకున్నాడో, ఆమె అతగాడిని

సంపాయించుకుందో. వాళ్ళ జంట నడక కృపారావుకు తెలుసా? తెలిసీ ఒదిలేశాడంటే ఆ వ్యక్తి అతనికి ప్రమాదభరితం కాదనేమో. తన భార్య నడకకు వెళుతుందని నిన్న అన్నపుడు నేనూ వెళుతుంటా అని అనంతం చెప్పలేదు కనుక అతను తన భార్య గురించీ చెప్పిన మరునాడే తానూ ఆ పనికి పూనుకుని ఇక్కడ ఆ పురుషుడితో నడుస్తుండటం గురించీ ఈరోజే చెప్పడం బాగుండదు. ఈ రోజు ఆట దగ్గిర బీచ్ కి నేను రేపటి నుంచీ వెళుతున్నా అని చెప్పి మరుసటి రోజు అసలు విషయం కదపొచ్చు.

వాళ్ళ మధ్య ఖాళీ లేకుండా భుజం భుజం రాసుకుంటూ నడుస్తున్నారు, తలలు ఒకరి వైపు మరొకరు తిప్పకుండా నడుస్తున్నారు. నిన్న వాళ్ళు కలిసినా చాలా కాలంగా కలవని వాళ్ళలా మాట్లాడుకుంటున్నారు. ఒళ్ళు తగ్గించుకోడానికి, నడవటానికి కాక కేవలం మాట్లాడుకోడానికే అక్కడికి చేరినట్లు కనిపిస్తున్నారు. ఎక్కువగా ఆగంతకుడు మాట్లాడుతున్నాడు ఆమెతో మాట్లాడటమే ఏదో లైంగిక సుఖం ఇస్తున్నట్టు; ఆమె పక్కనుంటే చాలు ఆమెను అనుభవిస్తున్నట్లు.

సముద్రపు గాలి ఒంటికి తాకుతున్నా, ఇసుకలో వేగంగా నడవటం శ్రమతో కూడిన పని కనుక అనంతానికి ముచ్చెమటలు పడుతున్నాయి. 'నేను ఓపలేను వాళ్ళ కలయిక, నడక' అనుకుని తనను చూసి తాను నవ్వుకున్నాడు; బాధపడ్డాడు కూడా. వాళ్ళిద్దరి మధ్యదీ స్నేహబంధమే కావచ్చు అని అనుకో గలిగితే మనసుకు కాస్త శాంతి దొరుకుతుంది. అలా అనుకోడం తనను తాను మోసగించుకోవడమే. మోసగించుకోగలిగినా మంచిదే. వాళ్ళిద్దరి బంధుత్వం ఉండకూడదని లేదు. అలా అనుకోగలిగినా శాంతి దొరుకుతుంది. అసూయ బాధిస్తుంది. పర పురుషుడితో, పరాయిస్త్రీ కలయికా అసూయ కల్గించడం విచిత్రమైన విషయం. తన ప్రణాళికకు పురిటిలో సంధి కొట్టలేదు కదా? తనకు జరుగుతున్న అన్యాయానికి తాను వెళ్లి వాళ్ళ ను రోడ్డు మీద అడ్డి ప్రశ్నించాలనుంది. తనకొచ్చిన బూతులు ఏకరువు పెట్టాలనుంది. తనకు ఎన్ని బూతులొచ్చో తనకే తెలియదు; ఎప్పుడూ లెక్కబెట్టలేదు గనుక. ఇష్టం లేని మనుషులను వాళ్ళ మొహం మీద తిట్టే వీలు అన్నివేళలా ఉండాలి; అయితే నన్ను ఇతరులు అలా తిట్టడానికీ ఆ వీలు కలుగుతుంది. సముద్రం వైపు తిరిగి దాని అలలను, నీటినీ ధిక్కరిస్తూ అడ్డుగా నడిచిపోవాలనిపించింది. మహా ఐతే చస్తాడు. వీరమరణం. ఆ ఆలోచనా సరళికి, భావోద్రేకానికి విరామ చిహ్నం పెట్టాడు మరో రకం ఆలోచనా స్రవంతిని ఆరంభించి. తాను అనుభవించిన సంచలనం నిజానికి కృపారావు అనుభవించాలి అతని భార్య ఒక వేళ పరపురుషుడితో కామాయణం సాగిస్తుంటే. అతని ఆవేదనను తన నెత్తి మీదికి ఎత్తుకోడం ఏమిటి. ఒకే కారణం తన సొంతంది: తాను ఆమె ద్వారా పొందవలసిన లబ్ధికి వాళ్ళిద్దరి కలయిక అడ్డు వస్తుందేమో అన్న ఆలోచన. అంతే.

ఇసుకలో నడవటం కష్టమని సముద్రపు గట్టు ఎక్కి రోడ్డును చేరి వేగంగా నడిచాడు. పావు గంట తరువాత వాళ్ళు వెనక్కు తిరగటం చూశాడు. ఆమె తనను చూసే ప్రమాదం ఉండటం చేత తిరిగి బీచిలోకి దిగాడు. ఇద్దరూ ఒకరి చేతిని మరొకరు పట్టుకోడం గమనించాడు గద్ద కళ్లలాంటి తన కళ్ళతో. పళ్ళు కొరుక్కున్నాడు. వాళ్ళు మాట్లాడుకుంటున్నది వినపడాలంటే వాళ్ళతో కలిసి నడవాలి. మాట్లాడుకుంటున్న రహస్యాలు, రహస్యాలు కానివి వాళ్ళను దాటి మరో చెవికి

సోకె అవకాశం పూజ్యం. ఆ పానకంలోని పుడక ఎవరన్నా కావచ్చు ఆమెకు బాగా దగ్గిరవాడు, దగ్గిరైనవాడు. ఆమె కొప్పు ఎత్తి మెడ వెనుక భాగం రుమాలుతో తుడుచుకుంటోంది. చాలా వేగంగా నడిచి ఉండాలి. రొప్పుతున్నాడు ఎలుగుబంటిలా. వేగం తగ్గించమనడానికి పురుషాహంకారం. వాళ్ళను తానున్న చోటును దాటనిచ్చి మళ్ళీ వెనక కాస్త దూరం నుంచీ నడుస్తున్నాడు. వాళ్ళు వాళ్ళదైనా లోకంలో ఉండి వెనుకకు పక్కలకూ చూడటం లేదు. ముక్కు సూటిగా నడుస్తున్నారు. ఆమె నడుం నలిగిపోతోంది.

వాళ్ళు విడిపోయారు. అది తాత్కాలికమైనదైనా సుందరదృశ్యంలా కనిపించింది అనంతానికి. అతను కాలి నడకనే వెళుతుండగా, ఆమె స్కూటరు స్టార్ట్ చేసి తుర్రుమంది. అతనిది దగ్గిరలో ఏదో ఇల్లయుండాలి.

అనంతం తన గదిని చేరే కొలది ఒక పథకం రూపు దిద్దుకుంటున్నది. నిజానికి తాను చూసిన విషయం తనకు వరంగా మారినా మారవచ్చనిపించింది. ఒక మార్గంలో తాను నడిపించాలన్న కథ మరో మార్గంలో వెళతానంటోంది. కూనిరాగం తీయడం మొదలుపెట్టాడు. అతను చాలా అరుదుగా కూనిరాగం తీస్తాడు; అది తనకు దివ్య గానంగా అనిపిస్తుంది. ఎక్కువ అల్లం, పచ్చిమిరపకాయ ముక్కలు వేసుకుని ఉప్మా చేసి ఒక సగం నిమ్మకాయ దానిమీద పిండి, కలుపుకుని, పళ్ళెము అంచులో చెంచాడు పంచదార వేసుకుని ఐదు నిమిషాలలో మొత్తం తిని, రెండు గ్లాసుల నీళ్లు లోపలి పోసుకుని, కాఫీ తయారు చేసుకుని ఆనందంగా చప్పరించాడు. కృపారావు పడే వేదన గుర్తుకొచ్చి ఆనందించాడు. ఎవరూ చావకపోతే కాటికాపరి ఎలా బతుకుతాడు?

కృపారావుకు చావు కబురు ఎలా, ఎంత చల్లగా చేరవేయాలా అన్న విషయంలో తర్జనభర్జన పడ్డాడు. భార్య నిర్వాకం కృపకు ముందే తెలిసుంటే తన పథకం తల్లక్రిందులవుతుంది. భార్యల రంకు తెలిసీ, పట్టనట్టుండే మొగుళ్ళుంటారు; తెలిసి ప్రాణాలు తీసుకునేవాళ్లూ ఉంటారు; ప్రాణాలు పుచ్చుకునే వాళ్ళూ కలరు. కృపా ఏ కోవ వాడు? తన సహాయాన్ని అర్థించేవాడుగా కావాలి.

ఆ సాయంత్రం తాను తెగించాలి. దానికై ఎదురుచూశాడు. మనసులో అసంఖ్యాకమైన చీమల లాంటి ఆలోచనలు పుట్టి, పారాడి సరిగ్గా ఆడలేకపోయాడు అనంతం.

"మేమెరిగిన అనంతం కాదు మీరు," అన్నాడు కృపా.

"నేనెరిగిన నేను కూడా కాదు నేను," అన్నాడు అనంతం నీరసంగా.

ఇలాంటి ఆటల్లో ఓడటం వలన పోయేదేమీ లేదు. ఒక దురద తీర్చుకోడమే ఈ ఆట. జీవితపు ఏ ఆటలో ఓడినా అది బాధిస్తుంది. కృపకు తెలిసిన అనంతం ఎంత అనుకున్నాడు అనంతం. గోరంత; తాను ఒక అగాధం; తనకే అంతుపట్టని వాడు. అతనికి తన గురించీ తెలుసుకో వలసిన అవసరం లేదు కూడా. ఒక అనామకుడితో, చిల్లిగవ్వ విలువ మాత్రమే కల ఆసామితో ఈ మాత్రం సహవాసం చేయడం విచిత్రం. తన రూపమే ఒకే ఒక కారణం. కృపా గురించి

మాత్రం అనంతం తెలుసుకో వలసినది అనంతం. అనుబంధం అన్నది ఇరువురి విషయంలో తల ఎత్తదు; ఆ అవకాశం లేదు. శత్రువులుగా మారే అవకాశం మెండు.

"ఇక నేను ఆడలేను. మీరు ఆడుతుంటే చూసి ఆనందిస్తా," అని వెళ్లి పచ్చిక మీద కూర్చున్నాడు మొహం మీది చెమటను వేళ్ళతో తొలిగించుకుంటూ.

"ఒంట్లో బాగాలేదా?' కృపా అడిగాడు సానుభూతితో.

"ఒంట్లో బాగానే ఉంది; కుడి పాదం కాస్త మెలిక తిరిగి నొప్పి చేసింది అంతే,"

పది నిముషాలు ఆడి, ఆట ముగియగానే, “మిమ్మల్ని మీ గది వద్ద దిగబెడతా పదండి," అన్నాడు కృపా. ఒద్దనకుండా బండి ఎక్కి కూర్చున్నాడు.

గది ముందు జాగ్రత్తగా దిగాడు. కృపా వెళ్ళిపోబోయాడు పని అయిపోయింది కాబట్టి.

"నా ఆతిథ్యం తీసుకోకుండా వెళ్ళడం అన్యాయం," అన్నాడు కంగారుగా.

"అయ్యో, అంత మాట ఎందుకు మిత్రమా? విస్కీ ఇస్తారా, రమ్ముతోనో బీర్ తోనో సరిపెడతారా?

"మీ దయ ఉండాలి గానీ ఆ రోజు నా జీవితంలో రాదా?"

ఆ చెక్క కుర్చీలో కాలు మీద కాలు వేసుకుని కూర్చున్నాడు; కుర్చీ, అది ఉన్నగదీ పేదవి కావచ్చుగాని సింహాసనం మీద కూర్చున్నంత దర్జాగా కూర్చోకూడదని లేదు. ఇంత పేద వాతావరణంలో నేను కూర్చోడమే నిన్ను ధన్యుడిని చేసినట్టు భావించు అన్నట్టుగా కూడా కూర్చోవచ్చు. 'వెళ్ళిరండి' అని పాయిఖానా వైపు చూపించాడు కృపాకు. అతను అక్కర్లేదన్నట్టు చేత్తో సూచించిన తరువాత అతను వెళ్లి  చేతులు, మొహం కడుక్కుని వచ్చి తన పరుపు మీద పద్మాసనం వేసుకుని ఉద్బోధ చేయబోతున్నట్టు కృపా వైపు చూశాడు. ఆ వాలకం చావు కబురు చల్లగా చెప్పబోతున్నట్టుగా కూడా వుంది. కృపకు ఆ వైఖరి ఏమిటో, ఏదో చెప్పబోతున్నట్టు, అది చల్లగా చెప్పబోతున్న చావు కబురు కావచ్చనే తెలియక పోవడం వలన చిన్నగా ఈల వేయడం మొదలుపెట్టాడు గదినంతా దాన్ని చదువుతున్నట్టు చూసి.

"ఈ సౌధం బావుందంటారా?"

"దీనికేమీ; దివ్యంగా ఉంది కదా?"

"మీ సహృదయతకు ధన్యవాదాలు. మీరు ఇలాంటి గదిలో ఉండగలరా?"

"నేను దివ్య పురుషుడిని కాదు కదా. మీరు ఉండగలిగినపుడు నేను ఉండలేను అని ఎందుకు భావించాలి? పరిస్థితులకు బానిసలం. బానిసగానన్నా బతికి ఉందామనుకుంటాము కానీ; చద్దామనుకుంటామా?"

"నాకున్న ఒకే ఒక స్నేహితుడు మీరు. ఈ విషయంలో మీరు గర్వపడక్కరలేదు; నేను గర్వపడాలి."

కృపా రెండు చేతులతో నమస్కారం పెట్టాడు. ఆతిథ్యం సంగతి గుర్తుకొచ్చి లేచి వెళ్లి కృపా భార్యకు ఇచ్చిన ద్రవాన్ని అతనికీ ఇచ్చాడు. అనంతాన్ని ధన్యుడిని చేస్తున్నట్టు దాన్ని అందుకున్నాడు.

"కుచేలుడి అటుకులు."

"అవి విలువైనవి కాబట్టేగా కృష్ణుడు అడిగి మరీ తిన్నాడు? కృష్ణుడు ప్రతిఫలంగా వరం ఇచ్చాడు కానీ అంతటి వరం నేను మీకివ్వలేను. కుచేలుడికి కృష్ణుడి స్నేహమే సంపద."

"పురాణాలూ గట్రా చదువుతుంటారా?"

"గుడి దగ్గిరే. వెళ్లి పురాణాలను భక్తితో విని వడపప్పు ప్రసాదం తింటుంటా. దాన్ని వాళ్ళ నాకు పైసా ఖర్చులెదు కదా; ఏదన్నా నాకు తెలియకుండానే మేలు జరగ వచ్చన్న నమ్మకమూ ఉంది."

నీరు తాగటం ముగించాడు.

"వరాలను లాక్కోడానికి వీలు లేదనుకుంటా."

"అది దోపిడీవో, రాంసమ్మో (ransom) అవుతుందనుకుంటా."

"నీళ్లిచ్చి మీ దగ్గిరి నుంచీ వరాన్ని ఆశించేంత మూర్ఖుడిని, అత్యాశాపరుడినీ కాదు అని అనుకుంటున్నా."

"మీరు మూర్ఖుడు అని అనుకున్నవాడు తప్పనిసరిగా మూర్ఖుడవుతాడు."

"కానీ మూర్ఖుడికి, దారిద్రియానికీ కాస్తో కూస్తో సంబంధం ఉండకపోదు అనిపిస్తుంటుంది."

"మూర్ఖపు ధనవంతులుండరంటారా?"

"ఉంటారు అని నేను భావిస్తే నేను అసూయాపరుడిగా నా గురించీ నేను భావించుకోవలసి ఉంటుంది."

"అసూయా, ద్వేషం మనిషి లక్షణాలేగా? వాటిని జయించగలిగిన మనిషేడీ? ఒంటరి జీవితానికి డబ్బు పుష్కలంగా ఉండక్కర లేదు," ఓదార్పుగా అన్నాడు కృపా.

"సంసారులకు కూడా కప్పెట్టేంత ధనం అక్కరలేదు. కానీ వాళ్ళు కలిగి ఉంటారు. మరింత సంపదకు తాపత్రయ పడతారు."

"మానవ బలహీనత. మన బలహీనతలు మనం బాధ్యులం కాదు. మనిషి తయారీ లోపాలలో అదొకటి."

"దేవుడికి కూడా మంచి సరుకుకును ఉత్పత్తి చేసే సామర్థ్యం లేదని అనుకోవాలా?"

"దైవ నిందకు పూనుకునేంత గొప్పవాడిని కాదు నేను," లెంపలు వేసుకుంటూ అన్నాడు కృపా.

ఊకదంపుడుకు విరామానిద్దామన్న నిశ్చయానికి వచ్చాడు అనంతం.

"నిద్రపట్టక పొద్దునే సముద్రం వైపు వెళ్లాను."

"బ్రహ్మచారి జీవితం అంతే. నిద్ర ఎరుగని రాత్రులు అనేకం. నేనూ ఒకనాడు బ్రహ్మచారిని. అలాంటివాళ్లకు సముద్రుడు మంచి నేస్తం."

పెళ్లయిన వాళ్ళూ కొన్ని కారణాల వాళ్ళ నిద్రలేమితో బాధపడుతుంటారు."

"పెళ్లయిన వాళ్ళ గురించీ మీకు తెలుసన్నమాట!"

"పోనీ మీ అభిప్రాయం చెప్పండి; నాదానికి భిన్నమయిందయితే."

"మా కుటుంబానికి చెందినంత వరకూ నిద్రను మాకు దూరం చేసే సమస్యలు కానీ, కలతలు కానీ లేవు. పైగా నాది అతి నిద్ర; ఏడుస్తూ కూడా నిద్రించగలను చిన్నప్పటిలా, ఇప్పటికీనీ."

"రాత్రిళ్ళు అతి నిద్ర పెద్దగా అపకారం చెయ్యదు గాని; పగలూ అతి నిద్ర పొయ్యే గుణం ఉంటె చెరుపు చేస్తుంది. వాస్తవాన్ని చూడనీయకుండా అడ్డుపడుతుంది."

"సోదాహరణంగా వివరించండి."

"సంసార జీవితంలోని లోటు పాట్ల గురించీ మీతో మాట్లాడటం అవ్వకు దగ్గులు నేర్పడం అవుతుంది."

"సముద్రం బాగుందా?"

"సముద్రం ఎప్పుడూ ఒకేలా ఉంటుంది; మరోలా ఉండటం దానికి తెలియదు; తెలిసినా ఉండటం చేతకాదు. అలల తాకిడి ఎక్కువ, తక్కువ – అంతే. అన్నట్టు మీరూ సుమతి గారిలా పొద్దునే నడకకు ఎందుకు వెళ్ళ కూడదు?"

"ఆమె మీకు కనపడిందా?"

"అవును. పలకరిద్దామనుకున్నాను కానీ ఎవరో ఆమె పక్కనుండటం వలన ఆ పని చేయలేక పోయాను. మీరూ ఆమెతో కలిసి వెళ్ళొచ్చుగా?"

"పొద్దున ఎనిమిది దాకా పడుకోటంలోని సుఖం నడక అనే కష్టాన్ని ఒద్దంటుంది. పైగా ఒంటరి నడకంటే నాకిష్టము అంటుంది ఆమె. నడుస్తూ మాట్లాడటం నాకు అసహ్యం; మీరు నా పక్కనున్నారంటే ఇంట్లో ఏదో వాదించుకున్నట్టు అక్కడా సముద్రం సాక్షిగా కూడా చెయ్యడం ఎందుకూ? అంటుంది."

"అక్కడికి వెళ్లిన తరువాత తెలిసిన వాళ్ళు ఎలాగూ తగులుతారు. ఆమెను ఒక్కదాన్నీ నడవనీయరు. మీ బంధువయ్యుంటాడు. ఎలుగుబంటి లాంటి వ్యక్తి మీ బంధువులలో ఉన్నారా? ఆమెను ఒదిలించుకోడానికి సుమతి గారికి వీలు లేకపోయింది. ఇద్దరూ కలిసి నడవ వలసి వచ్చింది."

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS